

కవాడిగూడ తాళ్లబస్తీలో రేషన్‌కార్డు దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్, సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులు

అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తాం

కవాడిగూడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో అందజేసిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తామని ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ అన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలల్లో సివిల్ సప్లై అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దార్ ప్రజాపాలనలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్ మాట్లాడుతూ, ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ప్రజాపాలనలో రేషన్ కార్డుకోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించామన్నారు. ఈ లిస్టులో పేరు రాని వారు ఆందోళన చెందవద్దని మరోసారి ఈసేవా, లేదా ప్రజాభవన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ అశోక్‌రెడ్డి, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.



అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

బీజేపీకి పూర్వవైభవం తీసుకురావాలి

కవాడిగూడ/చిక్కడపల్లి/రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు కృషిచేయాలని ఆలిండియా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ సూచించారు. గురువారం నూతనంగా ఎన్నికైన కవాడిగూడ, గాంధీనగర్, అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సలంద్రి దిలీప్‌యాదవ్, నవీన్‌కుమార్, పాశం సాయికృష్ణయాదవ్ తదితరులు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ పార్టీ పటిష్టతకు పాటుపడాలని నూతన అధ్యక్షులకు సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా పదవులు వస్తాయని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజవర్గంలోని ఆరు స్థానాల్లో బీపేపీని గెలిపించి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని సూచించారు. డాక్టర్ కె.లక్ష్మణ్ కలిసిన వారిలో కార్పొరేటర్ జి రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ నాయకులు జి వెంకటేష్, రంగరాజ్‌గౌడ్, పరిమళ్‌కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ ఎం. రమేష్‌రాం, సురేష్ ముదిరాజ్, ఆర్ పద్మ, ఎంసీ మహేందర్‌బాబు, ఏ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు. శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజు. బొల్ల రమేష్, లింగంగౌడ్, మాజీ అధ్యక్షుడు రత్న సాయిచంద్ తదితరులున్నారు.

సీఎం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకోని, పాలనపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హితవు పలికారు. గురువారం గాంధీనగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెన్ మాట్లాడారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేసేలా సీఎం యత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా పూర్తిస్థాయిలో మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకునే పరిస్థితి లేదని విమర్శించారు. కేవలం బీఆర్ఎస్ అగ్రనాయకులు కేసీఆర్, కేటీఆర్‌లపై విమర్శలు చేయడం, అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు మండిపడ్డారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే బీఆర్ఎస్ నేతలను అరెస్టులు చేయడం తప్పా ప్రజలకు మేలు చేసే ఏ కార్యక్రమాలు ప్రభుత్వం చేపట్టడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకోని, అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే కేసులు

- **బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ**

ముషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆరోపించారు. గురువారం ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరైన కేటీఆర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ముషీరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ముఠా జైసింహ మాట్లాడుతూ... ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఎలాంటి అక్రమాలకు పాల్పడనప్పటికీ కేటీఆర్‌ను, బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీయాలనే కక్షతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కేసులు పెడుతున్నాయని విమర్శించారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా కేటీఆర్ కడిగిన ముత్యం వలే బయటకు వస్తారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, వల్లాల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో ఉపాధ్యాయుడు అహ్మద్ భక్తియార్ తదితరులు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సన్మానం

ముషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకోని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను రేడియెంట్ హైస్కూల్ ఉపాధ్యాయులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం రాజ్‌భవన్‌లో హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సన్మానించారు. సన్మానించిన వారిలో ఉపాధ్యాయులు ఖలీల్ అన్వర్, మంజూశ్రీ, అనీఫ్ హర్షి ఉన్నారు.

ఇవేం పనులు

- అసంపూర్తిగా దోమలగూడ మున్సిపల్ పార్కు ఆధునికీకరణ
- హడావిడిగా పనులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
- తుప్పుబట్టిన ఆట పరికరాలు
- ఇబ్బందుల్లో వాకర్స్, సందర్శకులు

ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం, జీహెచ్ఎంసీ అధికారుల ఉదాసీన వైఖరితో స్థానిక ప్రజలు, వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కులో సదుపాయాలు కల్పించకుండా అసంపూర్తిగా వదిలేయడంతో ఇవేం పనులంటూ ఆవేదన చెందుతున్నారు.



దోమలగూడ ఈసేవా వద్ద మున్సిపల్ పార్కు

కవాడిగూడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ ఈ సేవ కేంద్రంలో సమీపంలోని మున్సిపల్ పార్కును రూ. 40లక్షల నిధులతో ఆధునికీకరిస్తామని ఎన్నికల ముందు హడావిడిగా పనులు ప్రారంభించారు. ఆ కార్యక్రమంలో కేంద్ర మంతి జి. కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ జి రచనశ్రీ తదితరులు పాల్గొని పనులను ప్రారంభించారు. పార్కులో ఓపెన్‌జిమ్, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, సందర్శకులు కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తారని అంతా భావించారు. ఎన్నికలు పూర్తి అయి 11 నెలలు అవుతోంది. అయినా నేటికి పార్కులో పనులన్నీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దాంతో పార్కుకు వస్తున్న సందర్శకులు, వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కులో చిన్నారులు ఆడుకునే ఆటపరికరాలు తుప్పుపట్టిపోయాయని, పార్కులో లాన్ ఎక్కడా ఏర్పాటు చేయలేదని, లైట్లు కూడా ఏర్పాటు చేయలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



లాన్‌లో మట్టితో నింపి అసంపూర్తిగా వదిలేశారు



తుప్పుపట్టిన పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

ఈ విషయంపై స్థానిక మునిసిపల్ అధికారి డీఈ సన్నీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తమ పరిధిలో ఉన్న పనులు పూర్తయ్యాయని, పెండింగ్ పనులు యూబీడీ అధికారుల పరిధిలో ఉందన్నారు. వారి దృష్టికి తీసుకెళ్లాగా నిధుల మంజూరు కోసం ఫైల్ పెండింగ్‌లో ఉందని, నిధులు మంజూరు కాగనే త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఇదే విషయంపై కార్పొరేటర్ జి రచనశ్రీని వివరణ కోరగా జీహెచ్ఎంసీ, యూబీడీఅధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పార్కు పనులు పూర్తి చేసేలా చూస్తానని తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పార్కులో సమస్యలను పరిష్కరించాలని స్థానికులు పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అభివృద్ధి పనులు పూర్తికాకముందే కాంట్రాక్టర్, అధికారులు పార్కును ప్రారంభించారని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి పోటాపోటీగా ఫొటోలు మాత్రం దిగారు. పార్కులు సందర్శకులకు, వాకర్స్‌కు ఎటువంటి సదుపాయాలు కల్పించలేదని మండిపడుతున్నారు. పార్కును ప్రారంభించి రోజులు గడుస్తున్నా నేటికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. దోమలగూడ మునిసిపల్ పార్కు సమీపంలోని గగన్‌మహల్ కాలనీ, అరవింద్‌నగర్ కాలనీ, దోమలగూడ మునిసిపల్ క్వార్టర్స్ వాసులు, దేవిప్రసాద్‌బాగ్, తాళ్లబస్తీ, అడ్వకేట్ కాలనీ, జేబీ అపార్ట్‌మెంట్ వాసులు పార్కులో కనీస సౌకర్యాలు కల్పించి పార్కువద్ద వాచ్‌మన్‌ను నియమించాలని కోరుతున్నారు.

తెలుగు భాషా వికాసానికి చిన్నయసూరి రచనలు దోహదం: దామోదర్‌గుప్తా

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వ్యాకరణాన్ని సులభశైలిలో అందించిన గొప్ప వ్యక్తి, వ్యాకరణ సిద్ధాంతకర్త చిన్నయసూరి అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురువారం గానసభలో పరవస్తు చిన్నయసూరి యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దామోదర్‌గుప్తా మాట్లాడుతూ తెలుగు భాష వికాసానికి చిన్నయసూరి రచనలు దోహదం చేశాయన్నారు. చిన్నయసూరి రచించిన నీతిచంద్రిక కథలు పిల్లలకు ఆసక్తి కలిగి వినోదంగా ఉండే రీతిలో నీతి నిజాయితీల విలువల గురించి అవగాహన కలిగిస్తాయని బాలల కథా రచయిత చొక్కాపు వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో కవి పెద్దూరి వెంకటదాసు, గాయని డా. శ్రీదేవి పాల్గొన్నారు.



చిన్నయసూరికి నివాళులర్పిస్తున్న కోలేటి దామోదర్, జనార్దనమూర్తి



ప్యాచ్ వర్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లోని అన్ని బస్తీలలో యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. వీరన్నగుట్ట బస్తీలో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తీలలో గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, భీమ్‌రాజ్, రామకృష్ణ, ఎస్ఎస్.రామ్, చంద్రయ్య, బాబు, రవియాదవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ శివరాజ్‌కు కార్పొరేటర్ పరామర్శ

- **చైనా మాంజా విక్రయాలపై చర్యలు తీసుకోవాలి**

నల్లకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత చైనా మాంజా విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. బుధవారం చైనా మాంజా మెడకు చుట్టుకొని గాయపడిన కానిస్టేబుల్ శివరాజ్‌ను గురువారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్‌లో ఉంటున్న శివరాజ్ నివాసానికి వెళ్లి కార్పొరేటర్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చైనా మంజా క్రయవిక్రయాలపై సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వులు అందజేస్తున్న పోలీసులు

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వీరేశం అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా నెలలో భాగంగా గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో అరోరా కాలేజీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలిసి చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ద్విచక్రవాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ల ప్రాముఖ్యతలను వివరించారు. ఈసందర్భంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు గులాబీ పువ్వులు, చాక్లెట్లు అందజేశారు.

వేర్వేరు రైళ్లలో బంగారు ఆభరణాలు, నగదు చోరీ

బర్కత్‌పుర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రైళ్లలో దొంగలు ప్రయాణికుల బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. భోపాల్‌కు చెందిన సయ్యద్ వాసీమా ఉన్నీసా కొంగు ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు బయలుదేరింది. మార్గమధ్యంలో ఖాజీపేట స్టేషన్‌కు రాగానే బ్యాగు కనిపించలేదు. అందులో 15 తులాల బంగారు ఆభరణాలు, రూ. 7 వేల సౌదీ కరెన్సీ ఉంది.

కాచిగూడ సూపర్ ఫాస్ట్, అజంతా ఎక్స్‌ప్రెస్‌ల్లో...

భోపాల్‌కు చెందిన శ్రద్ధాగుప్తా కాచిగూడ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తుంది. మహారాష్ట్రలోని ముత్కేడ్ రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే, అదే బోగీలో ఉన్న వ్యక్తి ఆమె హ్యాండ్ బ్యాగును లాక్కుని పారిపోయాడు. అందులో రూ.45 వేల నగదు, సెల్‌ఫోన్, ఆధార్, డెబిట్ కార్డులున్నాయి. నాగర్‌సోల్‌లో అజంతా ఎక్స్‌ప్రెస్‌రైలు ఎక్కిన జ్యోతి కాచిగూడకు బయలుదేరింది. ధర్మాబాద్ వద్దకు రాగానే ఆమె హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. బ్యాగుల 20 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, రూ30 వేల నగదు ఉంది. కేసు నమోదు చేసుకుని ఆయా స్టేషన్లకు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ట్యూషన్ ఫీజు చెల్లింపునకు ఆఖరు తేదీ 25

హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 25 వరకు సమయం కేటాయించామని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే అడ్మిషన్లు పొంది, సకాలంలో ఫీజు చెల్లించలేని విద్యార్థులు జనవరి 25లోపు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. వివరాల కోసం అధ్యయన కేంద్రంలో లేదా.. వర్సిటీ హెల్ప్‌లైన్ నంబర్లు 040-23680222/333 /444/555 పై సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

66 ఏళ్లు సాగిన ఆస్తి తగాదా

- **తుది తీర్పు వెల్లడించిన హైకోర్టు**
- **మక్తాపై వివాదానికి ముగింపు**

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వారసుల మధ్య 66 ఏళ్లపాటు సాగిన ఆస్తి తగాదా కేసులో గురువారం హైకోర్టు తుది తీర్పు ఇచ్చింది. నగరానికి చెందిన నవాబ్ మొయినుద్దులా బహదూర్ కుమార్తె సుల్తానా జహన్ బేగం 1953లో తొలుత ఆస్తుల విభజన కోసం సిటీ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేశారు. తర్వాత ఆ పిటిషన్ హైకోర్టుకు బదిలీ అయి సివిల్ సూట్ (సీఎస్ ఆఫ్ 7)గా నమోదయింది. ఈ కేసులో వారి మధ్య రాజీకుదుర్చి ఒప్పందం చేసేందుకు హైకోర్టు రాజా కిషన్‌దాస్, నవాబ్ సలీంఖాన్‌లను కమిషనర్ కం రిసీవర్లుగా నియమించింది. 1959లో ప్రాథమిక డిక్రీ జారీఅయింది. 1966లో భూములు, షేర్లు, ఇతర ఆస్తుల విభజన చేసి విభజన చేసి తుది పంపిణీ స్టేట్‌మెంట్‌ను దాఖలు చేశారు. అయినప్పటికీ ఉనికిలో లేని మక్తా ఆస్తుల కోసం లిటిగేషన్ కొనసాగుతోంది. ప్రాథమిక డిక్రీలో లేని ఆస్తులను తరువాత చేర్చడం కుదరని పేర్కొన్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం.. ఆ కేసును ముగిస్తున్నట్లు పేర్కొంది. 1970 నాటి ఆదేశాల ప్రకారం ఫైనల్ డిక్రీని తయారు చేసి ఇవ్వాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై సుప్రీంకోర్టులో ఉన్న ఇతర కేసులపై ఈ తీర్పు ప్రభావం ఉండబోదని స్పష్టంచేసింది.

తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి

రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శిగా జయరామ్



నల్లకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శిగా గూడ జయరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. బ్రాహ్మణ ఐక్యత కోసం కృషి చేస్తానని జయరామ్ అన్నారు.

రేపు నగర పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం (టీడీపీ) వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి ని ఈ నెల 18న నగర పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ సికింద్రాబా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి. సాయిబాబా వెల్లడించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు, పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ నివాళులర్పిస్తారని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు రసూల్‌పూర ఎన్టీఆర్ విగ్రహం నుంచి అమరజ్యోతి ర్యాలీ, 10 గంటలకు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్టీఆర్‌కు నివాళి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



విద్యానగర్‌లోని మార్క్స్ భవన్ వద్ద విలీనసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్దన్ తదితరులు

భద్రాద్రి- కొత్తగూడెంలో

ఐఎఫ్‌టీయూ విలీన సభ రేపు

నల్లకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బలమైన కార్మిక నిర్మాణం విస్తరణ కార్మికవర్గ విశాల ప్రయోజనాల కోసం ఈ నెల 18న భద్రాద్రి- కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయూ విలీన సభ నిర్వహిస్తున్నట్లు భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, ఆర్.జనార్దన్ తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఐఎఫ్‌టీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, జాతీయ నాయకులు బి.ప్రదీప్, సాధినేని వెంకటేశ్వరరావు, పి.ప్రసాద్, టి.శ్రనివాస్‌లు హాజరవుతారని తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో విలీనసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు.



ఐక్యత సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి.సంధ్య తదితరులు

24న మంచిర్యాలలో పీవోడబ్ల్యూ ఐక్యత సభ

రాంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రెండు ప్రగతిశీల మహిళా సంఘాల(పీవోడబ్ల్యూ) ఐక్యత సభ మంచిర్యాలలో ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు వి.సంధ్య, జె.ఝాన్సీ, జి.అనసూయ, వై.గీత, జి.భారతి, హేమలత వెల్లడించారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఐక్యత సభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. 1974లో పీవోడబ్ల్యూ ఆవిర్భావించిందని, అప్పటి నుంచి మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులు, అశ్లీల సాహిత్యానికి, వరకట్న వేధింపులు, హత్యలు, లైంగిక అత్యాచారాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.



ఊర్ల నుంచి.. నగర బాట

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూర్లకు వెళ్లిన ప్రజలు తిరిగి నగర బాట పట్టారు. గురువారం గౌతమి, విశాఖ, గరీభ్‌రథ్, సింహపురి ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ఇతర రైళ్లల్లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)

ముగిసిన మల్లన్న స్వామి బ్రహ్మోత్సవాలు

ముషీరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంభ మల్లికార్జునస్వామి(మల్లన్న) బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి ఆంజిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయి. అశోక్‌నగర్‌కు చెందిన భక్తుడు ఆర్. రాజనర్సింగ్‌రావు, ఉమామహేశ్వరి దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పటు చేయగా, వారు ప్రారంభించారు. అంతకుముందు ఊరేగింపుగా బోనాలు తీసుకవచ్చి మల్లన్న స్వామికి నైవేద్యం సమర్పించారు. రాత్రి అగ్నిగుండంలో నడిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, హారిక, యాదగిరి, సురేష్, రామానందరెడ్డి, రాజు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న స్వామికి బోనాలను తీసుకువచ్చిన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ కుటుంబసభ్యులు

గాయత్రి నాట్యం మనోహరం

చిక్కడపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాట్యగురువు సుజాతామూర్తి శిష్యురాలు గాయత్రి కాట్లపల్లి కూచిపూడి నాట్య అరంగేట్రం శ్రీసిద్ధ కూచిపూడి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. నాట్యగురువు డా. శోభానాయుడు రూపకల్పన చేసిన భామాకలాపం, శివస్తుతిలకు అనుగుణంగా నాట్యం చేసి ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా నాట్యగురువు సలాది మృణాళిని పాల్గొన్నారు. గాయత్రి నాట్యవిలాసం మనోహరంగా ఉందని అన్నారు.



నర్తిస్తున్న గాయత్రి